క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమం శుక్రవారం విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని మండపంలో సుదర్శన పెరుమాళ్లను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన నిర్వహించారు. పూర్ణాహుతిని శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకన్నకు క్షీరాభిషేకం



స్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు రామానుజాచార్యులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేషంగా క్షీరాభిషేకం జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

సందడిగా పాఠశాల వార్షికోత్సవం



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

పరవాడ: మండలంలోని గొర్లివానిపాలెం సాయి విద్యానికేతన్ పాఠశాల ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రంగారావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి, మనోవికాసానికి ఉపయోగపడే విధంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి




రైల్వేస్టేషన్‌లో మరణించిన గుర్తు తెలియని వ్యక్తి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని 7వ నంబర్ ప్లాట్ ఫాంపై శుక్రవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. సుమారు 65 ఏళ్ల వయసున్న అతని ఎత్తు 5.5 అడుగులు, చామనచాయ రంగులో ఉన్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీరావు తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ పోలీసులకు గానీ, 96661 22722, 94406 27547 నంబర్లకు గానీ సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

శంభో శంకర

- మహాశివరాత్రి సందర్భంగా ఆధ్యాత్మిక శోభ
- ఆది శంకరుడికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు



పూజలందుకున్న గొర్లివానిపాలెంలోని ఉమా రామలింగేశ్వరస్వామి



పినగాడిలో పూజలందుకున్న చోడేశ్వరస్వామి



కోటి దీపార్చన లో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ దంపతులు



దేవీపురంలో పంచభూత లింగేశ్వరునికి అభిషేకాలు నిర్వహిస్తున్న వేదపండితులు

సర్వం శివమయం..అంతటా హర నామస్మరణే..అన్ని దారులు ఆదిశంకరుని పవిత్ర సన్నిధికే..ఆ భోళా శంకరుడిని ప్రసన్నం చేసుకోవడానికి భక్తజనం పోటీ పడ్డారు..పవిత్ర హృదయాలతో అభిషేకించారు..శక్తి కొలది పూజలు చేశారు.. ఆ మహాదేవుణ్ని మనసారా కొలిచారు.

పెందుర్తి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం పెందుర్తి నియోజకవర్గంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పెందుర్తి, సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో ప్రసిద్ధ శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పెందుర్తిలోని పురాతన సాధూ మఠం రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువ జామునుంచి భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది.

- పినగాడి చోడేశ్వరస్వామి ఆలయంలో శివుని దర్శనానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. కృష్ణరాయపురం శివాలయంలో ప్రత్యేక హోమాలు చేశారు. రుద్రాభిషేకం చేశారు.
- శ్రమశక్తినగర్‌లో రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.
- చింతలగ్రహారం శివాలయంలో శంకరుడికి మహా రుద్రాభిషేకం చేశారు. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.
- నరవ, గణేష్‌నగర్, సుజాతనగర్, సరిపల్లి,ప్రశాంతినగర్, సుజాతనగర్ హరహర క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల వద్ద మజ్జిగ, ప్రసాద వితరణలు చేపట్టారు.

సింహాచలం: సింహగిరిపై ఉన్న శివాలయాల్లో విశేషంగా పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు.



సింహగిరిపై కాశీవిశ్వేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో శైవాగమం ప్రకారం తెల్లవారుజామున 5గంటల నుంచి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 10నుంచి రుద్రాభిషేకం, లింగోద్భవ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రమణమూర్తి ఈ పూజలు చేశారు.

- సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకుడు మంథా సుబ్బారావుశర్మ, కల్యాణ్ ఆధ్వర్యంలో ఈపూజలు జరిగాయి.
- 98వ వార్డు పరిధిలోని పాత అడవివరం, కాపుదిబ్బ, విజినిగిరిపాలెం, ప్రియాగార్డెన్స్‌లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శివనామస్మరణల్లో మునిగితేలారు.
- 98వ వార్డు సింహపురికాలనీలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో వార్షికోత్సవాల్లో భాగంగా



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మహా శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం విశేష కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 8.30 గంటల నుంచి స్వామివారి వార్షిక కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాత్రి 12గంటల నుంచి లింగోద్భవ పూజలు, నక్షత్ర హారతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

- 93వవార్డు ప్రహ్లాదపురంలోని ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచి పూజలు చేశారు. రాత్రి 9 గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు.

సబ్బవరం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని దక్షవాటి ప్రాంగణంలో కొలువైన పంచభూత లింగేశ్వరునికి శుక్రవారం వేదపండితుల మంత్రోచ్ఛరణలతో అభిషేకాలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. దక్షవాటి ప్రాంగణంలో శ్రీగణపతి సహిత రుద్రాభిషేకం నిర్వహించారు.అలాగే కామాఖ్య పీఠంలోని మహా కామేశ్వరుడు,కామేశ్వరులకు కామాఖ్య కల్యాణం నిర్వహించారు. లింగోద్భవ కాలంలో కొండపైన శివాలయంలోని క్షేత్ర పాలకుడు రాజరాజేశ్వరునికి పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకలో సబ్బవరంలోని న్యాయ విశ్వవిద్యాలయం,మారిటైం విశ్వవిద్యాలయం విద్యార్థులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- గొర్లివానిపాలెంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో వేదపారాయణ,నవగ్రహ పూజలు,విశేష హోమాలు జరిగాయి.బిల్వార్చన,పుష్పార్చన నిర్వహించారు.రాత్రికి ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చెంనాయుడు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

సబ్బవరం: లింగాల తిరుగుడులోని సోమలింగేశ్వర స్వామి సన్నిధిలో శుక్రవారం రాత్రి కోటి దీపార్చన ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని దీపారాధన నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ సతీసమేతంగా పాల్గొని దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ముందుగా దేవస్థానం కమిటీ చైర్మన్ కోరిబిల్లి నూకరాజు ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలికారు. దీపార్చనలో ఎంపీపీ బొకం సూర్యకుమారి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొటాన రాము, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవిందు, సీఐ పిన్నింటి రమణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు బోకం రామునాయుడు, రాపేటి రాము,దాడి కన్నంనాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి,మళ్ల కోటేశ్వరరావు, బొడ్డేటి మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



లింగాల తిరుగుడులోని సోమలింగేశ్వరస్వామి సన్నిధిలో కోటి దీపార్చనలో భక్తులు



దక్షవాటిలోని సహస్ర జ్యోతి లింగాలకు అభిషేకాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

ఘనంగా మహిళా దినోత్సవం



ఎంపీపీని సత్కరిస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

పరవాడ: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ దినోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడారు. మహిళా దినోత్సవాన్ని తొలుత మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారన్నారు. స్త్రీ అమ్మ, అక్కగా, చెల్లిగా, భార్యగా మనకు అన్ని విధాల ముందుండి నడిపిస్తూ ఇంటిని సక్రమంగా తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. మహిళలు ఆర్థిక, సామాజికంగా ఎదగాలని ని ఎంపీపీ వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు అన్నారు. అంతకుముందు ఎంపీపీని వాసవిక్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ మాజీ అధ్యక్షుడు భవిరిశెట్టి బంగారు బాబు, అధ్యక్షురాలు పద్మావతి, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో..

సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి దినదినాభివృద్ధిలో మహిళా వైద్యులు, మహిళా ఉద్యోగుల సేవలు అభినందనీయమని ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు ఆత్మకూరి కృష్ణకుమార్, అత్మకూరి విజయ్‌కుమార్ కొనియాడారు. 93వవార్డు నాయుడుతోటలోని



వైద్యులను సత్కరిస్తున్న ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు ఆత్మకూరి కృష్ణకుమార్, ఆత్మకూరి విజయ్‌కుమార్



కేక్ కటింగ్ చేస్తున్న ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా

శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశేష సేవలందిస్తున్న మహిళా వైద్యులు డాక్టర్ నస్రిన్, డాక్టర్ శిరీష, డాక్టర్ సువర్ణ, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ సీతతో పాటు సీనియర్ మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి జనరల్ మేనేజర్ రాధాకృష్ణన్, మేనేజర్(హెచ్‌ఆర్) శివప్రసాద్, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్యభట్ట కళాశాలలో..

సబ్బవరం: మండలంలోని గాలిభీమవరంలోని



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణరావు,డైరెక్టర్ సురేంద్ర కుమార్ బహుమతులు అందజేశారు.కళాశాలలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్ సమ్మద్ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా మహిళ ఉద్యోగులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సింహాద్రి ఎన్టీపీసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చందేరీ ముఖర్జీ అధ్యక్ష ఉపన్యాసం చేశారు. మహిళా కాంట్రాక్టు కార్మికులకు యూనిఫారాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సీజీఎం ఆర్ఆర్ పరిధా, ఓఅండ్ఎం జీఎం సురేష్ జాన్‌డేవిడ్, టెక్నికల్ సర్వీస్ జీఎం పద్మప్రియ, జీఎం నవోహుగడమ్, జీఎం బి.బి. పాత్ర పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్లబళ్ల పోటీలు



మొగలిపురంలో పరుగులు తీస్తున్న ఎడ్లు

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో వీరాంజయనేయ స్వామి తీర్థమహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బళ్ల పరుగు పందాల్లో 15 బళ్లు పాల్గొన్నాయి. నెక్కలపాలేనికి చెందిన పైడితల్లమ్మ బండి మొదటి స్థానంలో,అర్జునగిరికి చెందిన పరవాడ నాయుడు బండి రెండో స్థానంలో, కేఎల్‌బీ పట్నంకు చెందిన చిరికి దుర్గాప్రసాద్ బండి మూడో స్థానంలో,నెక్కలపాలేనికి చెందిన వెంకట కోమలి బండి నాలుగోస్థానంలో, లక్కవరానికి చెందిన నేమాల నరేష్ బండి 5వ స్థానంలో, కేఎల్‌బీ పట్నంకు చెందిన ఓబుల్‌రెడ్డి మోహన్ బండి 6వ స్థానంలో నిలిచాయి. వారికి వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు చొప్పున నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

వైభవంగా సూర్యనారాయణమూర్తి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పెందుర్తి: సుజాతనగర్‌లోని సూర్యనారాయణమూర్తి ఆలయంలో ఛాయ, ఉషా దేవరుల సమేత సూర్యనారాయణస్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు జరిపి అలంకరణ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, రాధామల్లిక దంపతుల చేతుల మీదుగా కల్యాణంలో పాల్గొన్న దంపతులకు వస్త్రాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మారుతీ గోత్రనామార్చనలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

123 మందికి వైద్య పరీక్షలు



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్య నిపుణులు

పరవాడ: మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆద్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో పరవాడలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య నిపుణులు బండారు బాలకృష్ణ, సంతోషకుమార్, శ్రవంతి, లీలా, వెంకట్, హేమ సుందర్ శిబిరంలో పాల్గొన్న రోగులకు వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. 123 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్టు ఆస్పత్రి ఎండీ బండారు బాలకృష్ణ చెప్పారు.

కారులో వ్యక్తి మృతి

పరవాడ: లంకెలపాలెం సమీపంలో రోడ్డు పక్కన నిలిపిన కారులో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పరవాడ పోలీసులు శుక్రవారం సాయంత్రం గుర్తించారు. సీఐ ఎస్.బాలసూర్యారావు అందించిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాలెం గ్రామానికి చెందిన మక్కపాటి బాపారావు(54) కొంత కాలం నుంచి వ్యాపారం రీత్యా పెదముషిడివాడలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో తన కారులో లంకెలపాలెం నుంచి గాజువాక వైపు వెళుతున్న క్రమంలో కారు రోడ్డు పక్కకు తీసి నిలిపివేశాడు. చాలా సేపు అయినా కారు తీయకపోవడంతో అనుమానించిన స్థానికులు పరవాడ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు కారు డోరు ఓపెన్ చేసి చూడగా బాపారావు అప్పటికే మరణించి ఉన్నాడు. బాపారావు లోబీపీ, షుగర్ వ్యాధులతో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ బాలసూర్యారావు చెప్పారు.

నారసింహ యజ్ఞానికి ఆహ్వానం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అశోక్‌గజపతిరాజు

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 26 నుంచి వచ్చే నెల 1 వరకు నిర్వహించనున్న శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞంలో పాల్గొనాలని దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజుకు ఆయన స్వగృహంలో శుక్రవారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆహ్వానపత్రిక అందజేశారు. యజ్ఞానికి సంబంధించి దేవస్థానం ముద్రించిన వాల్‌పోస్టర్‌ను అశోక్‌గజపతిరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ప్రతిభ



కేక్ కట్ చేస్తున్న విశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి

విశాఖ సిటీ: మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపించగలరని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కోరాటి అన్నారు. పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె కేక్ కట్ చేసి మాట్లాడారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను గుర్తించి సత్కరించడం స్ఫూర్తిదాయకమన్నారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–పోలీస్ శాఖ కుటుంబ సలహా నివేదిక', 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–పోలీసు శాఖ ఫ్యామిలీ కౌన్సెలింగ్‌కు హాజరుకు నోటీసు'అనే పుస్తకాలను విడుదల చేశారు. సీపీ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు గొప్పగా రాణిస్తున్నారని, మహిళలకు ఓర్పు, సహనం ఎక్కువని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వైజాగ్ సిటీ పోలీస్ మహిళా కో–ఆపరేటివ్ సొసైటీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖలో ప్రతిభ కనబరిచిన 26 మంది మహిళా పోలీసులకు సన్మానించి అవార్డు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ–1 వి.ఎన్.మణికంఠ చందోలు, డీసీపీ(క్రైం) పి.వెంకటరత్నం, ప్రాసిక్యూషన్స్ డీడీ ఎం.శైలజ, ఏడీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

సెలవు రోజున స్కూళ్ల నిర్వహణపై సీరియస్

విశాఖవిద్య: శివరాత్రి పర్వదినం సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించినా.. నగరంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు నిర్వహించడంపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించిన పాఠశాలల వివరాలను అందజేయాలని కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం విద్యాశాఖాధికారులను ఆదేశించారు. పిల్లలు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే శివరాత్రి పర్వదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించినప్పటికీ.. కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు తరగతులు నిర్వహించినట్టు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధారాలతో కమిషన్ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీన్ని సుమోటోగా స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో ప్రమాదం

- ఇద్దరి కార్మికులకు గాయాలు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) సంస్థలో శుక్రవారం ఉదయం ప్రమాదం జరిగింది. సంస్థలో పైప్‌లైన్ నుంచి స్టీమ్ ఫోర్స్‌గా రావడంతో ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులకు గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రమోద్ సింగ్, షాయిద్ మైతీ ఉపాధి నిమిత్తం గతేడాది మల్కాపురం వచ్చారు. హెచ్‌పీసీఎల్‌లోని సీఆర్–3 అనే సంస్థలో ప్రమోద్‌సింగ్ ఫోర్‌మన్‌గా, షాయిద్ మైతీ రిగ్గర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సంస్థ ఆవరణలో డీహెచ్‌ఎస్‌పీఎఫ్‌ఈ రీయూ ప్లాంట్ యూనిట్‌లో కొన్ని రోజుల నుంచి మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ యూనిట్‌లోని పైపుల్లో చమురు వంటి మడ్డి వంటి పదార్థాలు నిలిచిపోయాయి. దీంతో స్టీమ్‌ను ఆ పైపుల్లోకి ఎక్కించి, ఆ స్టీమ్ ద్వారా మడ్డిని బయటకు తీస్తున్నారు. ఐదు రోజులుగా ఈ పనులు జరుగుతుండగా.. శుక్రవారం ప్రమోద్‌సింగ్, షాయిద్ మైతీ ఈ పనులు చేపడుతున్నారు. ఆ సమయంలో పైపుల్లోని స్టీమ్ ఫోర్స్‌గా ఒక్కసారి బయటకు రావడంతో అక్కడ ఉన్న ప్రమోద్, మైతీ గాయపడ్డారు. తోటి కార్మికులు వారిని సంస్థ అంబులెన్స్‌లో నగరంలోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ మోజెస్‌పాల్, మల్కాపురం సీఐ సన్యాసినాయుడు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంపై ఆరా తీశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి వివరాలు సేకరించారు. మల్కాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.